# కన్నకొడుకు

"దండాల్దొరా..." అన్నపిలుపుకి ఆరోజు కోర్టులో వాదించాల్సిన కేసుకి సంబంధించిన ఫైల్ని చెకప్ చేస్తున్న లాయర్ శంకర్ తలెత్తాడు.

వయోభారంతో తనువంతా సడలిపోయిన ఓ వృద్ధుడు జాలిగా రెండు చేతులూ జోడించి ఎదురుగా నిల్చుని ఉన్నాడు.

"ఏవిటన్నట్లు" ఆ వృద్ధుడి వైపు చేసాడు లాయర్.

"నా పేగు పంచుకుపుట్టినోడి మీద కేసు పెట్టాలి దొరా!" ఒక్కొక్క అక్షరాన్ని కూడబలుక్కుని చెప్పాడతను. అలా చెబుతున్నప్పుడు ఆ ముసలాడి పెదాలు ఎండుటాకుల్లా వణికాయి.

భృకుటి ముడిచి, "అంటే... నీకొడుకు మీదా?" అనడిగాడు లాయర్.

పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ "అవును దొరా!" అన్నాడు.

ముసలాడివంక ఆశ్చర్యంగా చూస్తూ "ఎందుకని?" అని అడిగాడు.

"రెక్కలు ముక్కలు సేసుకొని ఆడ్ని గొప్ప సదువు సదివించినా దొరా! పైసలు సాలకుంటే గాఎకరం పొలం, సిన్న గుడిసె అమ్మినా. గియ్యాలేమో నాకూ, ముసల్దానికి కూడెట్టనంటున్నడు. కొలువు గూడ దొరికిందయ్యా. పట్నం పిల్లని మనువాడి గాపట్నంల్నే వుంటున్నడు. తిండికన్నా గొన్ని పైసలు పంపుర బిడ్డా అన్నా పంపనంటున్నడు. పోనీ కట్టం సేసుకుందామంటే ముసలు పాణాలాయె. రెక్కలాడ్తలేవు. మరెట్టా గడుత్తది మాకు!"

బొట్టుబొట్టుగా కళ్లలోంచి రాలిపడ్తోన్న కన్నీటిచుక్కల్ని భుజం మీది తువ్వాలుతో అద్దుకుంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడా వృద్ధుడు.

"ఒక్కడే కొడుకా?" అడిగాడు శంకర్.

"అవునయ్యా. బిడ్డలు గూడ లేరు." చెప్పాడు.

కాసేపు ఆలోచన్లో పడ్డాడు లాయర్.

కొన్ని క్షణాలు గడిచాక "మంచిది. ఓ నెలరోజులాగి కలువు. కేసు గురించి అప్పుడాలోచిద్దాం" అన్నాడు లాయర్.

శంకర్ మాటల్ని మరోలా అర్థం చేసుకున్నాడా వృద్ధుడు.

"ముసిల్దాని పెయ్యిమీదున్న పుత్తెలమ్మైనా ఫీజిచ్చుకుంట దొరా... బాంచను. నన్నూ ముసల్దాన్ని ఆడే సాకేట్టు సూడుండ్లయ్యా." అంటూ వంగికాళ్ళమీద పడబోయాడు.

అప్పటివరకూ శాంతంగా ఉన్న లాయర్ శంకర్ ముఖంలో రంగులు మారాయి. వృద్ధుడి వంక కోపంగా చూసాడు.

"ముఖ్యమైన పనిమీదున్నాను. ఇప్పుడు కుదరదు. తర్వాత రమ్మని చెబుతున్నావా?" అంటూ కసురుకున్నాడు.

లాయర్ మనసు కకావికలమైంది.

క్లయింట్స్‌పై ఎన్నడూ విసుక్కోవడంగానీ, వారితో అమర్యాదగా ప్రవర్తించడం కానీ చేయని లాయర్ శంకర్ ప్రస్తుత చేష్టలకి నివ్వెరపోయాడు జూనియర్ లాయర్ చంద్రశేఖర్. ఊర్లో లాయర్‌గా ఎంతో మంచిపేరుందాయనకి. పైగా పేదవాళ్లంటే కనికరం చూపిస్తాడు కూడా. మరిప్పుడిలా ఎందుకని అసహనాన్ని ప్రదర్శిస్తున్నట్లు?" అదే అర్థం కాలేదు చంద్రశేఖర్‌కి.

ముసలాడు ఆ గదిలోకి ఎంటరైనప్పటినుంచి తన బాస్‌తో జరిగే సంభాషణని ప్రేక్షకుడిలా వింటున్నాడు చంద్రశేఖర్.

ఆ వృద్ధుడిని ఓ పక్కకి తీసుకెళ్ళి శతవిధలానచ్చచెప్పి, మరోసారి వచ్చి లాయర్ని కలవమని బయటకు పంపేసాడు చంద్రశేఖర్.

★ ★ ★

ఓ సివిల్ కేసుకు సంబంధించిన ఫైల్ సిద్ధం చేయడానికి మ్యాటర్‌ని తన అసిస్టెంట్ చంద్రశేఖర్‌కి డిక్టెట్ చేస్తున్నాడు లాయర్ శంకర్.

దాన్ని నోట్ చేసుకుంటున్న చంద్రశేఖర్ రాయడం పూర్తయ్యాక, "సార్! ఇఫ్‌యూ డోంట్‌మైండ్. మిమ్మల్నో విషయం అడగాలనుకుంటున్నాను" అంటూ బాస్ సమాధానం కోసం చూసాడు.

"వైనాట్?! ప్రొసీడ్" అన్నాడు శంకర్.

"మరేం లేద్సార్. తన కొడుకుపై కేసు పెట్టమని ఒకరోజు ఓ ముసలాయన వచ్చాడు. మీకు గుర్తుండే ఉంటుంది. ఆ రోజు మీరెందుకతన్ని కసిరారో, అతడి కేసెందుకు టేకప్ చేయలేదో అర్థం కాలేదు" అంటూ తన సందేహాన్ని అతని ముందుంచాడు.

అది విని గాఢంగా నిట్టూర్చాడు శంకర్. కుర్చీలో వెనక్కి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడొక్క క్షణం.

తిరిగి కళ్ళు తెరుస్తూ-

"లాయర్‌గా ఇన్నాళ్ళూ చట్టాన్ని కాపాడాను. ధర్మాన్ని రక్షించాను. కానీ కొడుగ్గా మాత్రం కన్నవాళ్ళకి న్యాయం చేయలేకపోయాను. కారణాలేమైనా క్షమించరాని తప్పిదమది. నా తల్లిదండ్రులు నా నుండి దూరంగా ఉన్నారు. వాళ్ళని నేను పట్టించుకోవడం లేదు. ఆ ముసలాయన వచ్చి కన్నకొడుగ్గా నా బాధ్యతని గుర్తుచేసాడు. నా కళ్ళు తెరిపించాడు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని కన్నకొడుకులు ఆదరించాలన్న వాస్తవాన్ని నాకు గుర్తుచేసాడు. ఇన్నాళ్ళూ నేన్చేసిన పనికి చాలా సిగ్గుపడుతున్నాను. అందుకనే నా భార్యవద్దని ఎంత గొడవచేసినా ఇప్పుడు నాదగ్గరికే తీసుకొచ్చాను. ఇప్పటి నుంచైనా వాళ్ళని జాగ్రత్తగా చూసుకుంటాను" అని చెబుతోంటే ఉద్వేగంతో శంకర్ గొంతు తడబడింది.

తనకి తెలియని కొత్త విషయాన్ని బాస్ చెప్పడం విని ఆశ్చర్యచకితుడయ్యాడు చంద్రశేఖర్.

"ఇన్నాళ్ళు నా తల్లిదండ్రుల్ని వదిలేసి, ఆ ముసలాడిచేత అతని కొడుకు మీద కేసు పెట్టించడం... ఎందుకో మనస్కరించలేదు. నా మనస్సాక్షి ఒప్పుకోలేదు. ఇప్పుడు అమ్మనీ, నాన్ననీ నాదగ్గరే వుంచేసాను. కన్నకొడుగ్గా నా బాధ్యత స్వీకరించాను. లాయర్‌గా కూడా ఆ ముసలాడి కేసు టేకప్ చేయడానికి నైతికంగా అర్హుడనయ్యాను. ఎందుకంటే పవిత్రమైన ఈ లాయర్ వృత్తిలో ఉండి "చెప్పేవి శ్రీరంగనీతులు" చందంగా ఉండకూడదన్నది నా అభిప్రాయం. సో ఎంక్వైరీ చేసి ఆ ముసలాయన్ని పిలిపించు. ఫీజు అక్కర్లేదు కానీ కేసు టేకప్ చేసి వృద్ధుడికి న్యాయం జరిగేలా చూద్దాం. అతడి కొడుకుని కూడా పిలిపించు. నచ్చచెప్పి ఒప్పిద్దాం. తల్లిదండ్రుల్ని చూసుకుంటానంటే సరేసరి. లేదంటే అవసానదశలో కన్నవాళ్ళని కష్టపెడ్తున్న ఆ కొడుకు మీద మెయింటెనెన్స్ కేసు పెట్టి బుద్ధి చెబుదాం. తమని పెంచి, పెద్దచేసి, సర్వతో ముఖాభివృద్ధికి రక్తమాంసాలు ధారపోసిన తల్లిదండ్రుల్ని మరే కన్న కొడుకూ వారి అవసానదశలో నిర్లక్ష్యం చేయకూడదనే వాస్తవం అందరికీ ఈ కేసుతో తెలిసిరావాలి." అంటూ తన మనసులోని భావాల్ని చంద్రశేఖరానికి చెప్పాడు లాయర్ శంకర్.

ఆయన మనసు తేలికైందిప్పుడు.